మోడీ గోబ్యాక్ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: నవంబర్ 11,12 తేదీల్లో మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా ప్రజాసంఘాలు చేపడుతున్న మోడీ గో బ్యాక్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం, జిల్లా కార్యదర్శులు ఒమ్మి రమణ, తమ్మినేని సూర్యనారాయణ లు పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బీజీ భవనంలో నిర్వహించిన పత్రిక, మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ 11,12 తేదీల్లో ప్రజాసంఘాలు చేసే నిరసన కు వామపక్ష పార్టీలు గా మద్దతు తెలియజేసారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా మోసం చేసి విభజన హామీలు అమలు చేయకుండా, విశాఖపట్నం రైల్వే జోన్ ఇవ్వకుండా, వెనుకబడిన ఉత్తరాంధ్రకు,రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వకుండా పోలవరం ప్రాజెక్టు ను జాతీయ ప్రాజెక్టు గా గుర్తించి నిధులు ఇవ్వకుండా, నిర్వాసితులను నట్టేట ముంచి ఉత్తరాంధ్రకు ఉపాధిని చూపించే విశాఖ హుక్కును అమ్మేసిన మోడీ సిగ్గు సరం లేకుండా ఏ మొఖం పెట్టుకొని విశాఖ వస్తున్నాడని హేళన చేశారు. విశాఖ హుక్కు ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా సంవత్సరాల తరబడి పోరాటం జరుగుతుంటే ఒక్క రోజు కూడా నోరు మెదపని మోడీ విశాఖ వస్తుందంటే ఎగబడి ఎర్పాటులు చేస్తున్న సిఎం జగన్మోహన్ రెడ్డి ,ప్రతిపక్ష నాయకులు పైన తెల్పిన మోసానికి సంబంధించి ప్రశ్నించక పోతే వీరి కన్నా పెద్ద ద్రోహులు ఎవరూ ఉండరని హెద్దేవ చేశారు. ప్రతి ఒక్కరూ మోడీ పర్యటనకు వ్యతిరేకంగా జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రెడ్డి శంకర్రావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

మల్బరీ సాగు మరిన్ని ఎకరాల్లో విస్తరించాలి

కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర -విజయనగరం: జిల్లాలో మల్బరీ సాగు మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ.సూర్యకుమారి పట్టు పరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మల్బరీ సాగుకు అందుబాటులో వున్న వసతులను వినియోగించుకొని ఈ పరిశ్రమను విస్తరించాలని చెప్పారు. రూరల్ మండలం వేణు గోపాలపురంలోని పట్టుపరిశ్రమ శాఖ ఏ.డి. కార్యాలయం వద్ద వున్న సిల్క్ రీలింగ్ యూనిట్‌ను, విత్తనాల ఉత్పత్తి క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి బుధవారం సందర్శించారు. పట్టు నాణ్యత, ఉత్పత్తి తదితర అంశాలు తెలుసుకున్నారు. జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధి అవకా శాలపై ఏ.డి. ఏ.వి.సాల్మన్ రాజుతో చర్చించారు. జిల్లాలో ప్రస్తుతం 392 మంది రైతులు 700 ఎకరాల్లో మల్బరీ సాగుచేస్తున్నారని ఏడి వివరించారు. మల్బరీ సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం వచ్చే అవకాశం వున్నందున దీనిపై రైతులకు అవగాహన కల్పించి ఈ సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని పట్టుపరిశ్రమ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ఇతర పట్టు వెరైటీలకు సంబంధించి టస్సర్ ప్లాంటేషన్‌ను కూడా మరింతగా పెంచేలా కృషిచేయాలని కలెక్టర్ సూచించారు.

ఆసుపత్రి కార్మికులకు పెరిగిన వేతనాలు ఇచ్చే వరకు పోరాటం

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం క్రైమ్ : ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకి పెంచిన వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నందుకు నిరసనగా ఆంధ్రప్రదేశ్ వేతనాలు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో దశాలవారీ పోరాటాలకి సిద్ధపడినట్లు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ఘోషా మొదలైన పి.హెచ్.సి, సి.హెచ్.సి ఆసుపత్రిలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డులకి పెంచిన వేతనాలు ఇప్పించి సామరస్య వాతావరణం నెలకొల్పాలని కోరుతూ బుధవారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా ఇన్చార్జ్ సూపరింటెండెంట్ గౌరీశంకర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బుగత మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఘోషా, పి.హెచ్.సి, సి.హెచ్.సి ఆసుపత్రలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు ప్రభుత్వం జారీ చేసిన 549 జీవో ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్స్ అందరికీ 16వేలు జీతాలు ప్రకటించి ప్రభుత్వం ఒక ప్రైవేటు కాంట్రాక్టరు చేతిలో పెట్టడం దారుణమన్నారు. కాంట్రాక్టరు చేతిలోకి వెళ్లిన తర్వాత ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించక పోవడం వలన నేడు ప్రభుత్వాలు పెంచుతున్న ధరల భారాన్ని తట్టుకోలేక తీవ్ర మైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే కలుగజేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ అందరిని అప్కాశ్ లో చేర్చి ప్రతి నెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరంగా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు, జిల్లా కార్యదర్శి పురం అప్పారావు, వర్కర్స్ పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

- ఈ నెల 25న చలో ఢిల్లీ - పార్లమెంట్ మార్చ్
- ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న

విశాలాంధ్ర-బొబ్బిలి: దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని,నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలించాలని కోరుతూ, అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) అఖిల భారత విద్యార్ధి సమాఖ్య (ఏ ఐ యస్ ఎఫ్) అధ్వర్యంలో నవంబర్ 25న పార్లమెంట్ మార్చ్ నీ జయప్రదం చేయాలని కోరుతూ బొబ్బిలి పట్టణంలో ఉన్న కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనంలో గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లాప్రధాన కార్యదర్శి కోట అప్పన్న ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి డివిజన్ కార్యదర్శి బి రవికుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, భగత్‌సింగ్ జాతీయ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ యాక్ట్ ను అమలుచేయాలని, నూతన జాతీయ విద్యావిధానాన్ని నిలుపుదల చేయాలని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్. ఏ ఐ వై ఎ ఫ్ ఆ ధ్వ ర్యం లో నవంబర్ 25వ తేదీన చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా యువతకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయ్మెంట్ గ్యారంటీ యాక్ట్ ను అమలులోకిలి తీసుకురావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు తొత్తుగా వ్యవహరిస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు దార దత్తం చేయడంతో పాటు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా వ్యవస్థను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పే ప్రయత్నం జరుగుతుందని నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 25 ఢిల్లీలో జరిగే పార్లమెంట్ మార్చి కార్యక్రమంలో జిల్లా నుండి నిరుద్యోగ యువత విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ

వైద్య ఆరోగ్య రంగం పనితీరు ప్రశంసనీయం

సంతృప్తిని వ్యక్తంచేసిన కేంద్ర బృందం

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో వైద్యారోగ్య రంగం పనితీరును, కేంద్ర బృందం అభినందించింది. ముఖ్యంగా సఖి, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, మౌలిక వసతుల కల్పన, ఆశా, ఇతర సిబ్బంది పనితీరు, పర్యవేక్షణ, మందుల సరఫరా తదితర అంశాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. వైద్య సేవలపట్ల ప్రజలు కూడా సంతృప్తిని వ్యక్తం చేసినట్లు, బృందం వెల్లడించింది. జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్‌హెచ్‌ఆర్‌సికి చెందిన15వ కామన్ రివ్యూ మిషన్ ఏడుగురు సభ్యుల బృందం జిల్లాలో నాలుగురోజులపాటు పర్యటించింది. ఈ బృందం గ్రామాల్లో పర్యటించి, వైద్యరంగంలో క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. సిబ్బందికి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, తమకు నచ్చిన ప్రదేశాలకు వెళ్లి మరీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ పర్యటనలో వీరు పరిశీలించిన అంశాలను, బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారికి వివరించారు. పలు సూచనలు చేశారు. కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రంజన్ కుమార్ ఛౌదురి, డాక్టర్ అంకుర్ నాయర్, విశాల్ కటారియా, డాక్టర్ విజయ్ రజనా, డాక్టర్ శ్వేతాశర్మ, డాక్టర్ మోనికా షైనీ, డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, తాము అధ్య యనం చేసిన విషయాన్ని అంశాలవారీగా వివరించారు. అత్యవసర సేవలను కూడా చక్కగా అందిస్తున్నారని అన్నారు. రిఫరల్ విధానంలో మార్పులు తేవాల్సి ఉందని కేంద్రబృందం సూచించింది. జిల్లా కేంద్రాసుపత్రి, ఘోషా ఆసుపత్రుల్లో కూడా సాధారణ ప్రసవాలు జరగడం పట్ల ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సాధారణ ప్రసవాలు పిహెచ్‌సిల్లోనే పిహెచ్‌సిల్లో జరిగేలా చూడాలని, రిస్క్ ఉన్నవాటిని మాత్ర మే తరలించాలని సూచించారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, బృందం చేసిన సూచనల్లో పలు అంశాలను తాము ఇప్పటికే గమనించామని, మార్పులకు ఇప్పటికే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణ రావు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.56/2017 IN O.S.48/2009

పిటీషన్:
గొద్దటి అప్పియమ్మ భర్త సుబ్బారావు, వయస్సు 60 సం॥లు, మెట్టవలస గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా ...... డిక్రి హోల్డర్

ఎండ్:
యలమంచి అనీల్ కుమార్ తండ్రి బాల పాండు రంగారావు, వయస్సు 50 సం॥లు, రామభద్రపురం మండలం & గ్రామం, విజయనగరం జిల్లా ..... జె.డి.ఆర్

పై నెంబరు అమలును యిందలి డి.హెచ్.ఆర్ యిందలి జె.డి.ఆర్ నుండి రావలసిన అమలు మొత్తమును రాబట్టే నిమిత్తం యిందలి జె.డి.ఆర్ యొక్క స్వాధీన హక్కు అనుభవంలో యున్న యాదిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని బహిరంగంగా వేలం ద్వారా వేయుటకు పై అమలును యిందలి డి.హెచ్.ఆర్ దాఖలు చేయగా పై కోర్టువారు అమలు షెడ్యూలు దాఖలా ఆస్తిని తేది.21-11-2022 న ఉదయం గం॥ 10-30. ని॥ల లగాయితు బహిరంగ వేలం ద్వారా పై కోర్టులో వేలం వేయదలచి యున్నారు. కావున కావలసిన వారు సదరు వేలంపాటలో పాల్గొనదలచునని యిందు మూలంగా యావన్మందికి తెలియచేయడమైనది.

Schedule

District : Vizianagaram
Mandal : Ramabadrapuram
Village : Ramabadrapuram
Nature of property: dry land (now converted into house sites) S.No.336-1, extent: AC.437.44 Sq.yards, Assisment No.1410, Sriram Nagar Colony, (where on RCC house is there)
Boundaries: East : Vacant site sold away by the respondent/defendant to Sirla Kantamani @ Buji and her husband Venkata Rao. **South**: dry land covered in to house sites and sold away by one Peddinti Lakshmunaidu. **West** : vacant land of Pudi Dalinaidu. **North** : Vacant site sold away by the respondent/defendant to from the road jointly neighboring owner.
D.Hr value : Rs.5,00,000/
Amin value : Rs.8,00,000/
J.Dr not produced value

(యీ ప్రకటన శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు ప్రచురించడమైనది)

బొబ్బిలి
తేది: 09/11/22

కె.ప్రసాదరావు
పిటీషనరు తరుపు వకీలు
అడ్వకేట్, బొబ్బిలి

గిరిజన గ్రామాలను గోపాలరాయుడు పేట గ్రామపంచాయతీలో నమోదు చేయాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర-బొబ్బిలి : మండలంలోని సీయోను వలస, కృపవలస, దివ్వలవలస, రామన్నవలస గిరిజన గ్రామాలను గోపాల రాయుడుపేట పంచాయితీలో నమోదు చేయాలని, నివాసముంటున్న గిరిజన గ్రామాల ప్రజలకు ఆధార్ ,రేషన్ కార్డులు మంజూరు చేసి న్యాయం చేయాలని మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, పట్టణ సిపిఐ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ లు ఆధ్వర్యంలో ఆయా గిరిజన గ్రామాలకు చెందిన గిరిజనులు పాల్గొని ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ రాజారావుకు పలు డిమాండ్లతో పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా మండల పరిధి గోపాల రాయుడు పేట గ్రామ సమీపంలో నివాసమంటూ కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న గిరిజన గ్రామాలను గోపాల రాయుడుపేట గ్రామపంచాయతీలో నమోదు చేసి న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టి నిరసన తెలిపిన సంబంధిత శాఖ అధికారులు గిరిజనుల సమస్యలు పరిష్కారం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు గిరిజన సమస్యల పరిష్కారం చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బెహన్ తదితరులు పాల్గొన్నారు.

పేదవారికి కోర్టుల ద్వారా ఉచిత న్యాయ సహాయం

న్యాయమూర్తి వాణి

విశాలాంధ్ర -శృంగవరపుకోట: పేదవారికి కోర్టుల ద్వారా ఉచిత న్యాయసహాయం అందించటం జరుగుతుందని, రూ.3లక్షల లోపు తలసరి ఆదాయం ఉన్నవారు, దివ్యాంగులకు అవసరమైన ఉచిత న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయమూర్తి సబ్బవరపు వాణి స్పష్టంచేశారు. శృంగవరపుకోట మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన న్యాయ సేవల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ పేదవాడి చట్టంగా పిలవబడే న్యాయ సేవ అధికార చట్టం 1987లో రూపొందించి నప్పటికీ తదుపరి అనేక సవరణలు చేసిన మీదట 1995 నవంబరు 9 నుండి దేశమంతటా దీనిని కేంద్ర చట్టంగా అమలు చేస్తున్నారన్నారు. అవసరమైన వారికి ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత న్యాయ సహాయాన్ని ఈ సంస్థ ద్వారా నియమింపబడిన న్యాయవాదుల ద్వారా అందించబడుతుందని తెలిపారు. అవగాహన సదస్సులో న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి కేవీఎస్ రామరాజు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, తదితరులు మాట్లాడారు.

నెల్లిమర్లలో ఘర్షణ: కౌన్సిలర్ కి గాయాలు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి రామతీర్థం బ్రిడ్జి సమీపంలోని బ్రాందీ షాపు వద్ద జరిగిన దాడిలో 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. సారిపల్లి పంచాయతీ పరిధి నీలంరాజుపేటకు చెందిన వ్యక్తులకు మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో మైపాడ ప్రసాద్ కుడిచేయి విరిగింది. నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘర్షణ విషయంపై ఎఎస్ఐ కనకరాజును వివరణ కోరగా ఇరువురుపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

26 మంది హైరిస్కు గర్భిణీలు గుర్తింపు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన మిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం పి ఎం ఎస్ ఎం ఏ పథకంలో భాగంగా గర్భిణీలకు నెలవారి తనిఖీలను నిర్వహించారు. పి.హెచ్.సి వైద్యాధికారిని డాక్టర్ ఎస్ భాగ్యరేఖ గర్భిణీలను, వారి ఆరోగ్య తనిఖీలను నిర్వహించారు. మొత్తం 75 మంది గర్భిణీలకు తనిఖీలు చేయగా వారిలో 26 మంది గర్భిణీలు హైరిస్కుగా గుర్తించారు. తగినంత రక్తం లేకపోవడం, ప్రసవానికి తగినట్టుగా శారీరకంగా సిద్ధంగా లేకపోవడం, అనారోగ్యం తదితర కారణాలను గుర్తించారు? అనంతరం వారికి తగిన ఆరోగ్య సూచనలు చేసి మందులను అందజేశారు? ఈ కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు .

తెల్ల కార్డు వారికి ఉచిత బియ్యం

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో తెల్లరేషన్ కార్డు కలిగిఉన్న వారికి, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ అన్న యోజన పథకం క్రింద ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. నవంబరు నెలకు సంబంధించి, ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు రేషన్ డిపోల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క లబ్దిదారునికి 5 కిలోల చొప్పన, జిల్లాలోని 27 మండలాలకు చెందిన 5,51,066 మంది ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులందరికీ ఈ బియ్యాన్ని ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల కోసం జిల్లా పౌర సరఫరాల అధికారి, లేదా మండల తాశీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు.

టీషర్ట్స్ పంపిణీ

విశా లాంధ్ర- దెంకాడ: ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయనగరం జిల్లా ఎర్నింటి క్రిష్ణ (కిట్టు) మోదవలస శ్రీ బంగారమ్మ తల్లి పండగ సందర్భంగా అమ్మవారి సేవకులకు బహూ కరించిన "టీషర్ట్స్ "ను నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కనకాల రామారావు, బోని అప్పలనాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇన్చార్జి డిపిఓ గా కిరణ్ కుమార్

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: జిల్లా గ్రామపంచాయతీ ఇంచార్జ్ అధికారిగా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పెద్దింటి కిరణ్ కుమార్ ను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ నియమించారు. జిల్లా గ్రామపంచాయతీ అధికారిగా విధుల్లో ఉన్న బలివాడ సత్యనారాయణ వ్యక్తిగత సెలవు పై వెళ్లడంతో కిరణ్ కుమార్ కు అదరపు బాధ్యతలు అప్పగించారు.

డిప్యూటీ డిఎంహెచ్ ఓ గా అనిల్ కుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ఐటీడీఏ ఉపవైద్యాధికారిగా కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ అనిల్ కుమార్ కు డిప్యూటీ డిఎంహెచ్ఓ గా ఐటీడీఏ పీవో విష్ణు చరణ్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డిప్యూటీ డిఎంహెచ్ఓ గా పనిచేసిన డాక్టర్ దుర్గ వ్యక్తిగత సెలవు పై వెళ్లడంతో అనిల్ కుమార్ కు ఇన్చార్జ్ బాధితులు అప్పగించారు. గిరిజన ప్రాంతాలలో వైద్యశాఖ పర్యవేక్షణను అనిల్ కుమార్ చూడనున్నారు.

జిల్లా వైద్య అధికారుల తనిఖీలు

విశాలాంధ్ర- గుమ్మ లక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు గుమ్మ లక్ష్మీపురం లో వై టి సి కేంద్రాన్ని, సామాజిక ఆరోగ్య కేంద్రంలో వుండే బర్త్ వెయిటింగ్ హాల్ ను సందర్శించి గర్భిణీ ల ఆరోగ్య స్థితిని పర్యవేక్షించి, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీల ఆరోగ్యం పట్ల వైద్యసిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేస్తూ వుండాలని వైద్య సిబ్బంది కి సూచించారు. కురుపాం పరిధిలో వుండే మొత్తం ఆరు పిహెచ్‌సి ల వైద్యాధికారులు, సూపర్‌వైజర్స్ తో నిర్వహించిన సమావేశంలో అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ముఖ్యంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో నిర్వహించి గ్రామ స్థాయిలో వైద్యం సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వుండే బర్త్ వెయిటింగ్ హాల్ ను డిఎంహెచ్ఒ సందర్శించి గర్భిణీ ల ఆరోగ్య పర్యవేక్షణ చేసి అక్కడ సిబ్బందికి తగు సూచనలు చేశారు. బిత్రపాడు లో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ను సందర్శించారు. కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె జిల్లా కొఆర్డినేటర్ డి. భాస్కరరావు , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖైదీలకు న్యాయ సేవలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-బెలగాం: న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా పార్వతీపురం సబ్ జైలులో ఉన్న ఖైదీలకు న్యాయ సేవలపై మండల న్యాయ సేవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అడిషనల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ డి. సౌజన్య పాల్గొన్నారు. ఆమె అక్కడి ఖైదీలతో న్యాయ సేవపై సదస్సు నిర్వహించి వారికి న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు టి. జోగారావు, ఎస్. ఉమామహేశ్వరరావు, సబ్ జైలు సూపరింటెండెంట్ ఓ. అప్పలనారాయణ, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం

విశాలాంధ్ర పార్వతీపురం/ పార్వతీపురం టౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి జల్లేపల్లి వెంకట రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్ సిఎం స్కూల్ ఆవరణలో ఓటుహక్కు నమోదు పై అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. ఓటరు నమోదు అవగాహనా ర్యాలీ అర్ సి ఎం స్కూల్ నుండి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు ఓటరుగా నమోదు అవ్వండి - తలరాతను మార్చండి, మార్పు కావలంటే తప్పనిసరిగా ఓటువేయాలి తదితర నినాదాలతో ప్రజలను చైతన్యపరుస్తూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డి ఆర్ ఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి కీలకమని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని కోరారు. ఇకపై ఓటర్ల జాబితాను ప్రతీ త్రైమాసికంలో తాజా పరచడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అర్హులైన యువత నమోదు చేసుకున్న అనంతరం వారికి ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఐపిఐసి)ను జారీచేస్తారని ఆయన చెప్పారు. 2023 ఓటర్ల జాబితా వార్షిక సవరణలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటరు నమోదు కార్యక్రమంలో 2023 సంవత్సరం ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబరు 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు వయస్సు పూర్తి చేసుకునే వారు ఓటరుగా నమోదు కావడానికి ముందస్తుగా దరఖాస్తు సమర్పించవచ్చని ఆయన సూచించారు. ప్రభుత్వ ఏర్పాటులో అతిపెద్ద పాత్ర ఓటర్ల దని బాధ్యతగల ప్రతి పౌరుడు విధిగా ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. దేశాభివృద్ధికి, పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు ఎంతో కీలకమని అన్నారు. యువత నిరక్షరాస్యులకు అవగాహన కల్పించి ఓటుహక్కు వినియోగించుకొనెలా చైత్యం తీసుకురావాలన్నారు. అనంతరం అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటరుగా నమోదు చేసేందుకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథ రావు, అర్ బీ ఎస్ కే జిల్లా సమన్వయ అధికారి డా. ధవళ భాస్కరరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా విద్యా శాఖ అధికారి డా.ఎస్.డి.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ జాగరపు రామఅప్పల నాయుడు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



కురుపాం : కురుపాం తహశీల్దార్ ఆర్. రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఓటుహక్కు పొ అవగాహనా ర్యాలీ నిర్వహించారు.బుధవారం స్థానిక పెట్రోల్ బంక్ నుంచి బస్టాండ్ వరకు కిషోర్ చంద్రదేవ్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ నిర్వహించి బస్టాండ్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్దంగా సంక్రమించిన ఓటు హక్కు ను 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని ,ఓటు హక్కు అనేది ప్రతి పౌరుని బాధ్యత అని గుర్తుచేశారు. కావున తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో పంచాయితీ ఈవో కే చంద్రశేఖర్ వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

సొంత ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

రాష్ట్ర టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్: సొంత ప్రాంత అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహ కరించాలని రాష్ట్ర టిట్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం పార్వతీ పురంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను నిర్వహించారు. పార్వతీపురం పూర్వపు విద్యార్థులు వేలాదిగా హాజరయ్యి సంఘంగా ఏర్పడి(ఆప్సా) పేరున ఏర్పాటు చేయబడినటు వంటి వాట్సప్ గ్రూప్ ను పేస్ బుక్ ట్విట్టర్ ఇంస్టాగ్రామ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అప్సా ఏర్పాటు యొక్క ఆవశ్యకతను గురుంచి చైర్మెన్ ప్రసన్న కుమార్ సవివరముగా వివరించారు పార్వతీపురంలో జన్మించి ,ఈ ప్రాంతంలో విద్యనభ్యసించి ప్రపంచ దేశాలలో ఉన్నతమైన పదవులలో స్థిరపడిన వారిను, భారత దేశములో వివిధ రాష్ట్రాలలో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నవారిని భారత దేశములో మరియు ఆంధ్ర రాష్ట్రంలో వ్యాపారాలు డాక్టర్స్ ఇంజనీర్స్ ప్రజాసేవలో అంకితమైన వివిధ వర్గాల వారి పెద్దలను అందరినీ సోషల్ మీడియా పార్వతీపురం పూర్వపు విద్యార్థుల వేది గా ఒక చోట చేర్చి ఒకరికి ఒకరు కలిసి వారికున్న సమస్యలు తెలుపుకొని వాటి సాధన కొరకు అవసరమైన సలహాలు సూచనలు చేసుకొని ఒక సహృద్భావ వాతావరణముతో సంఘటితంగా కలిసి పనిచేసి తద్వారా తన ప్రాంతాభివృద్ధి సహకరించాలనే ఏర్పాటు చేయబడినదే అప్సా. అని అన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కార్యక్రమంనకు అన్ని చోట్ల ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నందున ఓటు వేసేందుకు అర్హత కలిగిన మీ కుటుంబీకులుగానీ, స్నేహితులు గానీ ఎవ్వరైనా ఉంటే తప్పక ఈ కార్యక్రమము వినియోగించు కోవలసిందిగా తెలియజేశారుఈ కార్యక్రమంలో స్థానికంగా ఉన్నటువంటి వివిధ కాలేజెస్ ప్రిన్సిపాల్ చలపతిరావు గాయత్రీ కాలేజీ కరెస్పాండంట్ మణిబాబు చుక్క భాస్కర్ గారు ఇందుపూరు గున్నే ష్ బెలగాం జయబాబు రాఘవ మజ్జు మురళి లెక్చరర్స్ మరియు ఇతర సిబ్బంది, పెద్ద ఎత్తున విద్యార్థులు మరియు ప్రజా ప్రతినిధులు కేతిరెడ్డి రాఘవ జోగినాయుడు మాష్టర్, గొర్లి వెంకటరావు,తాడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విధ్యార్థులు సన్మార్గంలో నడవాలి : సివిల్ జడ్జి వాసుదేవన్

విశాలాంధ్ర-సీతానగరం: విద్యార్థులు సన్మార్గంలో నడిచి సత్ప్రవర్తన కలిగి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని బొబ్బిలికోర్టు సీనియర్ సివిల్ జడ్జి, బొబ్బిలి మండల లీగల్ కమిటీ చైర్మన్ టి. వాసుదేవన్ పిలుపు నిచ్చారు.బుదవారం సాయంత్రం మండలంలోని జోగమ్మపేట బి ఆర్ అంబేద్కర్ గురుకులంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కూడా చట్టాలపై అవగాహన కలిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు.న్యాయ సేవలు, విద్యాహక్కుచట్టం తదితర అంశాలను వివరించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సరోజనమ్మ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. సౌమ్య జోసఫిన్, పలువురు న్యాయవాదులు ప్రసన్న కుమార్, వెంకటరమణ, ఎంతఓ సూరిదేముడు, ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ డి రాజారావు,అధ్యాపకుల, ఉపాధ్యాయ సిబ్బంది, పాటశాలసిబ్బంది, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిసారి విచ్చేసిన జడ్జీలకు,న్యాయవాదులకు విద్యార్థులు ఘన స్వాగతం పలికారు.

ఏకాగ్రత, కృషి,పట్టుదల ఉంటే విజయం తప్పక వరిస్తుంది

ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర-సాలూరు రూరల్: నియోజకవర్గ స్థాయి ఆటలపోటీలను బుధవారం ఉదయం పిఎస్.బొడ్డవలస లో ఉన్న బాలయోగి సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఉపముఖ్యమంత్రి రాజన్నదొర ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.కృషి,పట్టుదల,ఏకాగ్రత ఉంటే విజయం తప్పకుండా వరిస్తుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు ముందుగా చదువుపై దృష్టి పెట్టాలన్నారు.ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష్యసాధనే ధ్యేయంగా కృషిచేయాలన్నారు. మెనూలో మార్పులు చేస్తూ బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. చిన్నప్పుడు తాను హాస్టల్ లో చదువుకున్నప్పుడు ఇటువంటి ఆహారం, మౌళికవసతులు ఉండేవి కాదన్నారు. కానీ నేడు మౌళికవసతుల కల్పన, క్రమబద్ధమైన ఆహారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుం దన్నారు. అనంతరం వాలీబాల్ ఆడుతూ ఆటలపోటీలను ప్రారంభించారు. ఆటలపోటీలలో నియోజకవర్గంలో పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాలకు చెందిన 14 నుంచి 17 సంవత్సరాల విద్యార్థులు ఆటలపోటీలలో పాల్గొంటున్నట్లు గురు కులాల డిసిఓ చంద్రావతి తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, చెస్ వంటి 9 రకాల ఆటలలో పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ పోటీలలో 35 పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ వంగపండు.అప్పలనాయుడు, కౌన్సిలర్లు సింగారపు ఈశ్వరరావు, పప్పలలక్ష్మణ, గొర్లి వెంకటరమణ, ఎఎంసి వైస్‌ఛైర్మన్ బంకురు శ్రీనివాసరావు, వైకాపా నాయకులు సువ్వాడ,భరత్ శ్రీనివాస్, నెమలిపిట్ట కళ్యాణ్, గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ వంగపండు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

గిరి శిఖర గ్రామాల్లో బాదుడే బాదుడు కి అనూహ్యస్పందన

పోలీట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణి



విశాలాంధ్ర-పాచిపెంట : మండలంలో గల గిరి శిఖర గ్రామాలైన పూడి నందేడవలస గిరిజన గ్రామాలలో బుధవారం నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమానికి అనుహస్పందన లభించింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు గుమ్మడి సంధ్యారాణికి గిరిజన గ్రామాల ప్రజలు నీరాజనాలు పలికారు ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ పేద ప్రజల జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు కలిగించే ఈ ప్రభుత్వ విధానాలను తిప్పుకొట్టాలని అన్నారు పేద ప్రజలు అనునిత్యం వాడుకొనే నిత్యావసర సరుకులు ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ఎలా తిని బ్రతకాలి ఏమి తిని బ్రతకాలి అని ఆమె అన్నారు కూలికెళితే గాని పూట గడవని గిరిజన ప్రజలు ఈ ప్రభుత్వ హయాంలో ఎన్ని ఇబ్బందులు పడ్డారో వైయస్సార్సీపి మంత్రులకు ముఖ్యమంత్రి కి తెలియడం లేదని అన్నారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అల్లాడిపోతున్న రైతుల పాలిట ఎరువులు ధరలు ఆకాశాన్నంటే గిరి రైతుల జీవితాలను అల్లకల్లోలం చేశాయని ఆమె అన్నారు ఈ ప్రభుత్వ విధానాలపై మారుమూల గిరిజన గ్రామాల ప్రజల సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారా అనడానికి ఇదే నిదర్శనమని అన్నారు. అనారోగ్యం బారిన పడిన గిరిజనులు వైద్య నిమిత్తం కోసం ఆసుపత్రులకు వెళ్లాలన్న సరైన రహదారి సౌకర్యం కూడా నోచుకోని గిరిజన గ్రామాలు ఎన్నో ఉన్నాయని అన్నారు వైయస్సార్సీపి నాయకులు గడపగడపకు మన ప్రభుత్వం పేరుతో అవాకులు చవాకులు చెప్పి గిరిజన ప్రజలను మోసం చేస్తున్నారని ఆమె అన్నారు ఇలాంటి ప్రభుత్వం నూకలు చెల్లి పోయే రోజులు దగ్గరపడ్డాయని ఆమె అన్నారు బాదుడే బాదుడు కార్యక్రమానికి గిరిజన గ్రామాలు నుండి వస్తున్నటువంటి స్పందన చూసిన ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు పాంచాలి గ్రామ సర్పంచ్ గూడెం యుగంధర్ మిత్తి వలస గ్రామ సర్పంచ్ ప్రతినిధి పోల్నాయుడు తోపాటు పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

కళలను కాపాడుతున్న భజనల బృందాలు

బొబ్బిలి యువరాజు బేబీనాయన

విశాలాంధ్ర,సీతానగరం: అంతరించి పోతున్న కళలను కాపాడటంలో భజనల బృందాలు చేస్తున్నకృషి గొప్పదని బొబ్బిలియువరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్, బొబ్బిలి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబీనాయన తెలిపారు.బుదవారం మండలంలోని జోగమ్మపేటగ్రామంలో ఆడిటర్, మక్కువ మాజీఎంపిపి పెంటతిరుపతిరావు, కర్రి రాములు ఏర్పాటుచేసిన కార్తీకమాస అన్న సంతర్పణకార్యక్రమం, వివిధగ్రామాలకు చెందిన భజనబృందాలు కార్యక్రమాన్ని ఆయనచేతులుమీదుగా ప్రారంభం చేశారు.ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనమాట్లాడుతూ భజనబృందాలుద్వారా ఆధ్యాత్మికత పెరుగుతుందన్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మికతను పెంపొందించడానికి పాటలరూపంలో భజనబృందాలు చేస్తున్నకృషి ఎనలేనిదన్నారు. ఈకార్యక్రమంలో జనసేన జిల్లానేత మర్రాపు సురేష్, సర్పంచ్ కల్యంపూడి.సింహాచలం, కొల్లి తిరుపతిరావు, పోలఈశ్వరనారాయణ, పోల వెంకటనాయుడు, వెంకటరమణ పంతులు,సురేష్, సబ్బాన శ్రీనివాసరావు, లక్ష్మణ,భజనబృందాల గురువులు విమల, కూర్మినాయుడు, సుబ్బినాయుడు, శ్రీఆంజనేయ ఆలయ భజనమండలి సభ్యులు, సుబ్బమ్మ పేరంటాల సభ్యులు, గ్రామపెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బేబీనాయనను, పెంట తిరుపతి రావులను గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు.

కన్నుల పండువగా.. బాబా ఉరుసు ఉత్సవ్-2022

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : సూఫీ షెహన్షా హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి చరిత్రాత్మక తొలి ఉరుసు ఉత్సవ్-2022 బుధవారం చీమలపాడులో ఘనంగా జరిగింది. ఈ మేరకు రెండో రోజు జరిగిన ఉరుసు ఉత్సవ్ లోని కీలక ఘట్టాలను అతావుల్లా బాబా వారసులు, చీమల పాడు, విజయనగరం దర్గా-దర్బార్ ల ఎ ఎండీ ఖ్వాజా మోహియుద్దీన్, ఎండి ఖలీల్ షరీఫ్ షా వెల్లడించారు. బుధవారం వేకువజామున హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా దివ్య సమాధికి గుశుల్(శుద్ధి స్నానం) చేయించారు. సుగంధం, పూలు, పరిమిళ భరిత సుగంధ ద్రవ్యాలతో బాబా వారి వారసులు ఆయనకు చాదర్ సమర్పించారు. అలా చరిత్రాత్మక తొట్ట తొలి సుగంధ మహోత్సవం సూఫీ సైద్ధాంతిక సంప్రదాయం ప్రకారం వేలాది మంది భక్తుల మధ్య ఘనంగా జరిగింది. ఈ మహత్తర కార్యానికి అజ్మీర్ బాబా గరీబ్ నవాజ్ వారి దర్గా నుంచి ఖాదీం అజీమ్ హస్మి తదితరులు హాజరై పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా దర్గాలో ఉదయం ఖురాన్ పఠనం, ఫకీరు మేళా నిర్వహించారు. మధ్యాహ్నం లంగర్ లో అన్న సమారాధన ద్వారా భక్తులకు ప్రసాదాన్ని అందించారు. సాయంత్రం ఫకీరు మేళా, తప్పెట గుళ్లు, పులి వేషాల బృందాలు, వివిధ కళా రూపాలు, డప్పు వాయిద్యాల సందడితో పుర వీధుల్లో అతావుల్లా బాబా వారి సందల్ (ఊరేగింపు) అంగరంగ వైభవంగా జరిగింది. ఉరుసు ఉత్సవాలకి విచ్చేసిన వేలాది మంది భక్తులు అతావుల్లా బాబా వార్కి చాదర్, పూలు, సుగంధాలను సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా పరిసరాలన్నీ హజరత్ తాజుద్దీన్, ఖాదరీ, అతావుల్లా బాబా వార్ల నామస్మరణతో మారుమ్రోగాయి. బాబే బుగ్దాద్ లంగర్ లో బుధవారం రాత్రి వేలాది మందికి భారీ అన్న సమారాధన జరిగింది. ఈ ఉత్స వాలకు దేశ నలుమూలల నుంచి బాబా భక్తులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు హాజరై బాబా దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. బాబా వారి కుమారులు జాఫర్ బాబు, ఖాదర్ బాబు, ఆయన శిష్యులు మరిశర్ల సీతాపతి రావు ఉరుసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓటే వజ్రాయుధం

విశాలాంధ్ర - దత్తిరాజేరు : ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఓటే వజ్రాయుధం అని ఇన్చార్జి తాసిల్దార్ రమేష్ అన్నారు. ఓటు హక్కు వినియోగంపై బుధవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం చేపట్టి ఓటు హక్కు వినియోగంపై నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, సమాజం పురోగతి సాధించాలన్న, మంచి నాయకులను ఎన్నుకోవడంతో సాదించవచ్చు అన్నారు. అందుకే భారత ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు తమ కర్తవ్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ఓటు చేర్పించుకొని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ జగన్నాథం, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సత్యసాయి ట్రస్ట్ సేవలు అమోఘం : ఎమ్మెల్యే కడుబండి

విశాలాంధ్ర - వేపాడ /లక్కవరపుకోట : శ్రీ సత్య సాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ వారి సేవలు అమోఘమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. లక్కవరపుకోట మండలంలోని మల్లివీడు మండల పరిషత్ పాఠశాలలో బుధ వారం శాసనసభ్యులు ఆధ్వర్యంలో సత్యసాయి ట్రస్ట్ వారు విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యసాయి ట్రస్ట్ సభ్యులు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలు ఎనలేనివని ఆయన కొనియాడారు. ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో తాటిపూడి జలాశయం సమీపంలో చినఖండేపల్లి గ్రామంలో ఉచిత క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, త్వరలో ఆ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు,సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున,కోరుకొండ చల్లమనాయుడు,పెద్దిరెడ్డి వెంకటేష్,కాటపల్లి శ్రీను, కసిరెడ్డి కృష్ణ, (స్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్)శ్రీ జయ లక్ష్మి,జామి ఈశ్వరరావు, ఎంపీడీవో, ఎంఈఓ, ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - డెంకాడ : మండలంలోని చొల్లంగిపేట గ్రామపంచాయతీ పరిధిలో చొల్లంగిపేట డిఆర్ పాలెం సేరి పాలెం నగరిపేట గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రజాబి ప్రాయం తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ముందుగా ఎమ్మెల్యే సచివాలయ సిబ్బందితో గ్రామంలో జరుగుతున్న లబ్ధిని వారికి చేరిన పథకాలని గ్రామ వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకొని, లబ్ధిదారులకు ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, జడ్పీటిసి బడ్డు కొండ లక్ష్మి, ఏఎంసి వైస్ చైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షుడు రొంగలి కనక సింహాచలం, ఎంపీడీవో డిడి. స్వరూప రాణి, ఎమ్మార్వో పి.ఆదిలక్ష్మి, వివిధ శాఖల అధికారులు వివిధ గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : అత్యుత్తమ ప్రమాణాలు, గ్యాప్ నియమాలను పాటించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ పంట దిగుబడులు సాధించవచ్చని రిసోర్స్ పర్సన్ కె.భారతి (డీఆర్సి-ఏడీ) తెలియజేసారు. ఎస్.కోట ఆర్బీకేలో కొత్తవలస సబ్ డివిజన్ పరిధిలోని ఎస్.కోట, వేపాడ, కొత్తవలస, లక్కవరపుకోట, జామి మండలాల వీఏఏలు, వీహెచ్ఏలకు పొలంబడి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలంబడి ఏవో లోకేశ్, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఐదు మండలాల ఏఓలు పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో 'బాదుడే బాదుడు'

విశాలాంధ్ర - సీతానగరం : పెంచిన విద్యుత్ ఛార్జీలను,ఆర్టీసిబస్సుఛార్జీలు, గ్యాస్ ధరలు, డీజిల్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలు, నూనె ధరలు తగ్గించాలనికోరుతూ తెలుగుదేశం పార్టీ అధ్వర్యంలో పెదబోగిలిగ్రామ పంచాయతీలోని అప్పయ్యపేట గ్రామంలో బాదుడే బాదుడు కార్యక్రమంను నిర్వహించారు. బుధవారం సాయంత్రం మాజీఎమ్మెల్యే, నియోజక వర్గ ఇంఛార్జి బొబ్బిలి చిరంజీవులు అధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అన్నింటిలో బాదుడే బాదుడు అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై అన్నివర్గాల ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారన్నారు. ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసుగుచెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపి అధ్యక్ష, కార్యదర్శులు కొల్లితిరుపతిరావు, రౌతు వేణుగోపాలనాయుడు, నియోజక వర్గ సీనియర్ నేత గర్భాపు ఉదయభాను సర్పంచ్ తేరేజమ్మగరికయ్య, సాలాహరి, బోను చంద్రమౌళి నాయకులు సబ్బాన శ్రీను బుడితిశ్రీను, లక్ష్మణ, యోగేశ్వరరావు, సూర్యనారాయణ, వెంకటనాయుడు, పారినాయుడు, సింహాచలం, శంకరరావు, సత్యనారాయణ, అప్పయ్యపేట టీడీపీ నాయకులు, అభిమానులు తదితరులున్నారు.

ఉన్నత విద్యావంతులకు విదేశాలలో ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల : ఉన్నత విద్య అభ్యసిస్తొన్న వారికి విదేశాలలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని ఐఫ్లైస్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గ్రంధి దర్మ చైతన్య చెప్పారు. బుధవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో విదేశాలలో ఉన్నత విద్య అవకాశాలు, స్థితిగతులు, విధి విధానాలు, సౌలభ్యతం అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాలలో మన దేశంలో కంటే అత్యధిక వేతనంతో కూడిన ఉపాధి అవకాశాలు అత్యధికంగా ఉన్నాయన్నారు. మనం ఏ దేశం వెళ్లాలో ముందే నిర్ణయించుకోవాలని, వాటికి కావాల్సి న అర్హతలను ముందే తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, సిఎస్ఇ విభాగాధిపతి లక్ష్మణ్, దీపక్ జోగినాయుడు, డీన్ డాక్టర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, పారామెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో పట్టణ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో పట్టణానికి చెందిన విద్యార్థులకు పతకాలు లభించగా సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా ఈ పతకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పట్టణానికి చెందిన కరాటే కోచ్ కె.సతీష్ బుధవారం విడుదల చేసిన ప్రకటన లో గంటా కనకారావు మెమోరియల్ ఇన్విటేషనల్ స్టేట్ కరాటే ఛాంపియన్షిప్-2022 జిందాల్ భారతి విద్యా మందిర్ కొత్తవలసలో జరిగిన పోటీలలో ఈ పతకాలు లభించాయన్నారు. కరాటే పోటీలకు సంబంధించి కాటా, కుమిటి విభాగాలలో మన విజయనగ రానికి చెందిన 16 మంది విద్యార్థులకు ఈ పతకాలు లభించా యన్నారు. ఈ పతకాలను విద్యార్థులకు అందజేసి ప్రముఖ సినీ నటుడు, కరాటే ఛాంపియన్ సుమన్ విద్యార్థులను అభినందించారని తెలిపారు. కరాటే స్టేట్ మీట్ లో పతకాలు సాధించడం పట్ల స్థానిక సత్యా కళాశాల డైరెక్టర్ ఎం.శశి భూషణ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ సాయిదేవమణి, కన్యూరియూ కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.సంతోష్ కుమార్, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

దాడి ఘటనపై విచారణ ముమ్మరం

విశాలాంధ్ర - సీతానగరం : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఘటనపై పార్వతీపురం డీఎస్పీ సుభాష్ బుదవారం ఉదయం నుంచి చాలా సమయం సీతానగరంలో విచారణ జరిపి సంఘటన జరిగిన తీరును తెలుసుకున్నారు. స్తానిక బజారులోను, వెలుగు కార్యాలయంలో ఆయన పలువురిని విచారించారు. పెదభోగిలికి చెందిన హరియాల నాగేంద్రను కోటసీతారాంపురం గ్రామానికి చెందిన దివ్వెల కేశవ రాడ్‌తో సీతానగరంలో దాడిచేసి గాయపర్చడంతో హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీతానగరం ఎస్ఐ నీలకంఠం చెప్పారు. ఈ కేసును డీఎస్పీ విచారణ చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రస్తుతం గాయపడిన సురేంద్ర పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

విశాలాంధ్ర - కురుపాం : క్రీడలు మానసిక ఉల్లాసానికి,దేహదారుడ్యానికి ఎంతో మేలు చేస్తాయని నీలకంఠాపురం సర్పంచ్ ఎ.మన్మధరావు అన్నారు. బుధవారం మండలంలో గల నీలకంఠాపురంలో నిర్వహిస్తున్న గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి వాలీబాల్, కోకో ఎంపికలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. గిరిజన గ్రామాల్లో చదువుతున్నటు వంటి గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలని క్రీడలు వలన ఆరోగ్యం కూడా బాగుండి మానసికంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు అందక ఇబ్బందులు : చిరంజీవులు

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు పింఛన్దారులకు జీతాలు అంతక చాలా ఇబ్బందులు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పించిన్దారులు జీతాలు పైన ఆధారపడి జీవితాలు సాగిస్తున్నారని అలాంటిది ఒకటో తారీఖున ఒక అందవలసిన జీతాలు ఎంతవరకు అందకపోతే వారు ఏ విధంగా కుటుంబాలు పోషిస్తారని ప్రశ్నించారు. నెల అంతా పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోవడం వలన తీవ్ర ఇబ్బందుల్ను పడుతున్నారని ఈఎంఐలు మందులు కుటుంబ ఖర్చులు పిల్లల చదువులు తదితర వాటిని ఏ విధంగా భరించగలరని అన్నారు. ప్రజల నుండి వసూల్ను చేస్తున్న పన్నుల ద్వారా మొదటగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదారులకు జీతాలు చెల్లించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు ఉండవలసిన మొత్తాన్ని అందుబాటులో ఉంచుకోవలసిన ప్రభుత్వం బాధ్యత రహితంంగా వ్యవహరించి ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు. జీతాల్ని ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన్నా ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీకి జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

విశాలాంధ్ర- మక్కువ : మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి.సుబ్బారావు పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లా 9వ జిల్లా మహాసభ మక్కువలో బుధవారం జిల్లా అధ్యక్షులు కే.ఈశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం రెడ్డి శ్రీరామమూర్తికి సభ నివాళులర్పించింది. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు మాట్లాడుతూ 1936లో సుందరయ్య నాయకత్వంలో ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం ఎన్నో పోరాటాలు చేస్తూ ఎన్నో విజయాలను అందుకుంటూనే ఉందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు దాసోహమై కార్మిక, కర్షక ప్రజల ప్రయోజనాలను పక్కన పెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, ఉపాధ్యక్షులు సిహెచ్.నాయుడు, సిఐటియు రాష్ట్ర నాయకులు రెడ్డి వేణు, మన్యం జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పావాడలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

విశాలాంధ్ర - జామి : దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా ప్రశంసలు అందుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగన్‌మోహనరెడ్డి అని, రాష్ట్రాన్ని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందని ఎస్‌కోట ఎమ్మెల్యే కడేబండి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని పావాడ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతీ ఇంటికి వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి, జగన్ పాలనపై వారి సంతృప్తి స్థాయిని తెలుసుకున్నారు. అలాగే సమస్యలను తెలుసుకుని స్థానిక సచివాలయ సిబ్బందికి పరిష్కారం నిమిత్తం తగు సూచనలు చేసారు. ఎమ్మెల్యే వెంట జెడ్‌పిటిసి గొర్లె సరయు, మండల పార్టీ కన్వీనర్ గొర్లెరవికుమార్, స్థానిక వైసీపీ నేతలు అల్లు అప్పలనాయుడు,వివిధ గ్రామాల సర్పంచ్‌లు చంద్రునాయుడు, పిన్నింటి రవి, కిలారి సూర్యారావు, అప్పాన సుబ్రహ్మణ్యం, పాటూరి రామసత్యం,తహశీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఎంపిడివో ఎం.సతీష్, స్థానిక ఎఎస్ఐఆర్. నరసింగరావు, హెచ్‌సిలు శానాపతి ఈశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : హిజ్రాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. బుధవారం లిఫ్టింగ్ హాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామాక్షి నగర్‌లో ఉన్న కాపు సంక్షేమ భవనంలో పుట్టింటి సారె సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీసస్ క్రీస్ట్ బ్లెస్సింగ్స్ మినిస్ట్రీస్ ప్రతినిధులు నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు హిజ్రాలకు సారె సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి కోలగట్ల మాట్లా డుతూ ఏ వర్గమైనా సమాజంలో మంచి కార్యక్రమాలు చేపడితే ప్రజా మన్ననలు ఉంటాయన్నారు. ఏ సమస్య ఉన్నా నేరుగా తన వద్దకు రావచ్చని చెప్పారు. అసోసియేషన్ వినతి మేరకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయమై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ సామగ్రి సరఫరాలో జాప్యం తగదు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : నాడు నేడు పనులకు నిర్మాణ సామగ్రి సరఫరా జాప్యం కారాదని జాయింట్ కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నాడు నేడు పనుల పురోగతిపై జిల్లా అధికారులతో బుధ వారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న నాడు నేడు పనులకు బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయడం జరుగుతోందని, పనుల పురోగతి సాధించాలని ఆయన పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి అధ్యక్షతన సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, గనుల శాఖ అధికారులు బృందంగా ఏర్పడి ప్రతీ రోజు నాడు నేడు పనులపై చర్చించి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖదికారి డా.ఎస్.డి.వి రమణ, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకరరావు, గనుల శాఖ అధికారి చంద్ర నాయక్, క్రషర్స్ క్వారీల యజమానులు పాల్గొన్నారు.

అయ్యన్న పాత్రుణ్ని కలిసిన కురుపాం టీడీపీ నాయకులు

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : తెలుగుదేశం సీనియర్ నాయకులు చింతకాయల అయ్యన్న పాత్రుడ్ని బుధవారం ఆయన ఇంటివద్ద మర్యాద ఎ ంగా కురుపాం నియోజకవర్గ నాయకులు కలిసారు. తెలుగుదేశం పార్టీ మాజీ గ్రంధాలయ సంస్థ చైర్మన్ దత్తిలక్ష్మణరావు మాట్లాడుతూ అర్ధరాత్రి పూట అరెస్టు చేసి వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందన్నారు.ఆయన్ను జైల్లో పెట్టినప్పటికీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారనీ, ఆయన యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు అరుకు పార్లమెంట్ యస్ టి.సెల్ ప్రధాన కార్యదర్శి బిడ్డక తమ్మయ్య, బిడ్డక పద్మావతి, పువ్వల లావణ్య, శ్రీరామ భూపతి దొర, రాజపు విజయ్ కుమార్, మరడాన వెంకటనాయుడు, మీసాల శశీభూషణ్ రావు, రామారావు,సతివాడ శంకరరావు,హిమరక నారాయణ, శ్రీనివాస్ ,రాగాల అప్పలకొండ,మరియు ఐదు మండలాలు నాయకులు పాల్గొన్నారు.

బగ్గందొరవలసలో 'ఫ్యామిలీ ఫిజీషియన్ '

విశాలాంధ్ర - బెలగాం : సీతానగరం మండలం బగ్గందొరవలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను 104 డాక్టర్ వంశీబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడి గత కొంతకాలం నుండి మంచానికే పరిమితమైన ఉత్తరావిల్లి అప్పలనాయుడు ఇంటికి వెళ్ళి వైద్య సేవలు అందించడం జరిగిందని, అలాగే గ్రామంలో అంగన్వాడీ పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, వయోవృద్దులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారందరికి వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడే మందులు ఇచ్చి తగు జాగ్రతలు తీసుకోవాలని తెలియ చేసామన్నారు. ప్రజలు ఈ వైద్య సేవలు వినియెగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, ప్రసాద్, భారతీ, సరస్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల సదస్సు

విశాలాంధ్ర - విజయనగరం : వి.టి.అగ్రహారంలో గల ఏ.పి.ఐ.ఐ.సి. బిల్డింగు ప్రాంగణంలో గురువారం ఉదయం 10.30 గంటలకు పారిశ్రామిక, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఏ.పి.ఎస్.ఎఫ్.సి విజయనగరం బ్రాంచి మేనేజరు ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పారిశ్రామికవేత్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు ఏ.పి.ఎస్.ఎఫ్.సి కేంద్ర కార్యాలయం అసిస్టెంట్ జనరల్ మేనేజరు రోజేంద్ర రెడ్డి హాజరుకానున్నారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి పి.రమేష్ ఆదేశించారు. బుధవారం గజపతినగరం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వివిధ శాఖల అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. డిసెంబర్లో జరిగే గృహప్రవేశాలకు సన్నద్ధం కావాలన్నారు, అలాగే మండలంలో ఇంకా నిర్మాణంలో ఉన్న సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు , వెల్ నెస్ సెంటర్లు భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పప్పు సుదర్శనం వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు

గూడెంలో నాటు కోళ్ల పెంపకం కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - గుర్ల : మండలంలో గూడెం గ్రామంలో వైయస్సార్ కాంతి పథకం ఆధ్వర్యంలో మహిళ సంఘ సభ్యులకు రూ.2 లక్షలతో నాటు కోళు పెంపకం కేంద్రాన్ని జడ్పీటిసి శీర అప్పల నాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.సూర్యనారాయణరాజు, వైసిపి నాయకులు పోట్నూరు సన్యాసి నాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళలు సంఘ సభ్యులకు బ్యాంకు లింకేజులు, శ్రీనిధి మొదలగు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణ అభివృద్ధి చైర్మన్ బంగారు నాయుడు, వైస్ ఎంపీపీ తిరుపతి రావు, సీనియర్ నాయకులు వరద ఈశ్వరరావు, ఏపిడి సావిత్రి, ఏరియా కోఆర్డినేటర్, సీతారామయ్య, ఏపీఎం నారాయణరావు, స్థానిక సర్పంచ్. లక్ష్మణరావు, గ్రామ పెద్దలు , వైయస్సార్ కాంతి పథకం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంచాది అప్పారావుకు ఏపీ గ్రంథాలయ సంఘం పురస్కారం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ప్రతీ ఏటా జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి గ్రంథాలయసంఘం ప్రదానం చేసే పురస్కారానికి విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయులు పంచాది అప్పారావు ఎంపికైనట్లు ఎపి గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లాశాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 1993 నుండి పాత్రికేయునిగా సేవలందిస్తున్న అప్పారావు ఆర్ట్స్ లో మాస్టర్ డిగ్రీతో పాటు బి.ఇడి కూడా పూర్తి చేసారు.ఈ నెల 15వ తేదీన పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామని ప్రకటనలో పొందుపరచారు.

ప్రధానమంత్రి మోడీకి ఘన స్వాగతం పలుకుదాం : ఎంపీ బెల్లాన

విశాలాంధ్ర - బొండపల్లి : ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఘన స్వాగతం పలకడానికి ప్రజలు తరలిరావాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ గజపతి నగరం ఎమ్మెల్యే అప్పల నరసయ్య బుధవారం బండపల్లి మండలంలోని గొట్లాంలో గల సత్య ఫంక్షన్ హాల్‌లో గజపతి నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన విశాఖ పట్నంలో పలు కార్యక్రమాలకు శంకుస్థాపనలు మోడీ చేస్తారని అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేయాలని అన్నారు. ఇందుకోసం బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రఘురాజు పెనుమత్స సురేష్ బాబు జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభు జి, నారాయణ మూర్తి రాజు ఏఎంసి చైర్మన్ నాయుడు, ఎంపీపీలు జ్ఞాన దీపిక, చెల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు

56 మంది గర్భిణీలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్యాధికారి డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో 56మంది గర్భిణీలకు ప్రత్యేక వైద్య చికిత్సలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా వైద్య పరీక్షలలో 20మంది ఐరిష్కు గర్భిణీలను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. అనంతరం వైద్యాధికారి సతీష్ గర్భిణీలకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఎంపీటీసీ పిల్ల లక్ష్మి, మరియు ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉదారత చాటుకున్న గ్రామ సర్పంచ్

విశాలాంధ్ర - గరివిడి : మండలంలో గదబవలస గ్రామ సర్పంచ్ సత్యనారాయణ విద్యార్థుల కోసం గదబవలస, దుగ్గివలస అప్పనవలస విద్యార్థులు పాఠశాలకు మరియు కళా శాలకు వెళ్లాలంటే నడక మరియు సైకిల్ తో వెళ్తుంటారు. ఈస సమస్యను సర్పంచ్ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా దుగ్గివలస మాజీ ఎంపీటీసీ ముచర్ల సత్యనారాయణ. వార్డ్ మెంబెర్ శ్రీను. నరుసు ములు జిల్లా పరిషత్ చేర్మెన్ మజ్జి శ్రీనివాసరావుకి దృష్టికి తసుకెళ్లారు. మరుసటి రోజు గదబవలస సర్పంచ్ సత్యనారాయణ తన సొంత ఖర్చులతో గదబవలస సరిహద్దు రోడ్డు నుంచి ఐతంవలస రోడ్డు సుమారు 3 కిలోమీటర్లు వరకు రోడ్డు బాగు చేశారు. బస్సు రావడానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డు మొత్తం పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ గొర్లె కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రధాని ప్రత్యేక హోదా ప్రకటన చేయాలి : ఆమ్ ఆద్మీ

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్ : రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేకహెూదా ఇస్తున్నట్లు విశాఖలో ప్రధాని మోడీ ప్రకటన చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కె.దయానంద్ డిమాండ్ చేసారు. ఆ పార్టీ కార్యాలయం వద్ద బుధవారం రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ప్రకటించాలని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు మద్దతిచ్చిన బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత విభజన సమయంలో ఇచ్చిన హామీలను పక్కన పెట్టిందని ఆరోపించారు. ఈ కార్యక్రంలో కో కన్వీనర్ రంప సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బూరాడ శ్రీనివాస్, నియోజకవర్గం కన్వీనర్ తిప్పాన కోటేశ్వరరావు, గంట్యాడ మండల కన్వీనర్ శంకరరావు, విద్యార్థి విభాగం కన్వీనర్ టీవీ నర్సింహులు, కిలాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిట్టి గురువులు పరీక్షను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - తెర్లాం : బాడంగి మండలంలో చిట్టి గురువులు కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యులకు ప్రాధమిక స్థాయి మదింపు పరీక్షను నవంబర్ 13 వ తేదీన అన్నీ గ్రామాల్లో జరుగుతుంది అని మండల విస్తరణ అధికారి ఎస్ .సూర్యనారాయణ బుదవారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, మేట్లు, ప్రధానో పాధ్యాయులు, సెక్రటరీలు, మరియువెల్ఫేం అసిస్టెంట్లు అందరూ గ్రామ స్థాయిలో ఏ విధంగా ఈ కార్యక్రమం విజయవంతం చేయాలో సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో మండలంలో గల అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సెక్రటరీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, వెలుగు విఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచాలి

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు వయోపరిమితిని 45 ఏళ్లకు పెంపుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం వయాపరిమితి 42 ఏళ్లుగా ఉందని, అయితే ఉద్యోగ నోటిఫికేషన్లు పెద్దగా లేకపోవడంతో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఇదే సమయంలో న్యాయస్థానాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ కి నోటిఫికేషన్ విడుదల చేసారని, వీటికి 42 ఏళ్ళు వయోపరిమితి విధించడం వల్ల నిరుద్యోగులు తమకు నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారని సామల తెలిపారు. ఈ మేరకు తగు చర్యలు తీసుకోవాలని సామల ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

'పొలంబడి'ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : సబ్ డివిజన్ లో నాలుగు మండలాల రైతు భరోసా కేంద్ర సిబ్బందికి పొలంబడి కార్యక్రమముపై శిక్షణా కార్యక్రమంను బొబ్బిలి సహాయ సంచాలకులు ఎం.శ్యాం సుందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరి మరియు ఇతర పంటలపై ఆరోగ్యమైన పంటలు పండించడం పై విత్తన ఎంపిక, నేల సంరక్షణ, సాగు పద్ధతులు, సమగ్ర ఎరువులు యాజమాన్యం,సమగ్ర సస్య రక్షణ పద్ధతులు పై అవగహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ ఏడీఏ బి.ప్రకాష్, వ్యవసాయ అధికారి టీ.సంగీత నాలుగు మండల వ్యవసాయ అధికారులు,ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.